
ఏవియానికా

# Avionica

एवियानिका

HOUSE MAGAZINE OF HAL HYDERABAD DIVISION



GENERAL MANAGER RECEIVING HIS EXCELLENCY A.P. REUTOV, DY. MINISTER OF RADIO INDUSTRY, USSR ON HIS VISIT TO HAL ON 27TH JANUARY 1988

# సంస్కారం

-ప్రతాప వెంకట సుబ్బారాయుడు-

సాయంత్రం ఏడు గంటలు.

విశాల మార్కెట్ బయటకు వచ్చి చుట్టూ చూసింది. శీతాకాలం కావడం వలన సంధ్య చీకట్లు ఆవరించుకుంటున్నాయి. దూరంగా వెళుతున్న రిక్షావాడ్ని పిలిచి, బేరమాడి ఎక్కి కూర్చుంది. తనలో తాను ఏవో లల్లాయి పాటలు పాడుకుంటూ, నెమ్మదిగా రిక్షా తొక్కుతున్నాడు.

వీధి లైట్ల వెలుగులో రిక్షావాడ్ని పరీక్షగా చూసింది విశాల. తైల సంస్కారం లేక అట్టలు కట్టుకు పోయిన జుట్టు, ముఖం కుడి వైపుకి తిప్పినప్పుడల్లా బుగ్గపై కనిపించే అరంగుళం కత్తిగాటు, వాడి బట్టల నుంచి వస్తున్న అదో రకమైన వెగటు కలిగించే వాసన, రిక్షాకెవరైనా అడ్డువస్తే వాడు తిట్టే బూతులు,, వాడ్ని గమనిస్తున్న కొద్దీ వాతావరణం చల్లగా వున్నా విశాలకి భయంతో చెమటలు పట్టసాగాయి.

ఇటీవల ఆమె చూసిన సినిమాల్లోనూ, విన్న వార్తల్లోనూ చోటు చేసుకున్న స్త్రీలపై జరిగిన అత్యాచారాలు ఆమె మనోఫలకంపై కదలాడుతూ ఆమెని భయపెట్టసాగాయి.

అంతలో రిక్షావాడు రిక్షాని ఒక సందులోకి తిప్పాడు. ఆ సందు అంతకు ముందు ఎరగని విశాలకి గుండెల్లో రైళ్ళు పరిగెట్ట సాగాయి.

"ఇదేంటి ఈ సందులోకి తిప్పావు?" తడారి పోయిన గొంతుకతో అడిగింది విశాల.

"ఇట్నైతే తొరగా ఎల్లచ్చుమ్మగారూ!" వాడి మాటలు సామ్యంగా వున్నా కర్కశం గానే వినిపించాయి విశాలకి.

నిర్మానుష్యంగా వున్న ఆ ప్రాంతంలో దూరంగా కనిపిస్తున్న తుమ్మ పొదలను చూసి ఆమె వెన్ను జలదరించింది.

'ఆ పొదలమాటుకి లాక్కెళ్ళి నగలన్నీ గుంజుకుంటాడేమో? వెధవ నగలు పోతే పొయ్యాయి, ప్రాణాలు తీస్తే, అమ్మో!' అప్రయత్నంగా ఆమె చేతులు గుండెలపై వాలాయి.

కళ్ళు మూసుకొని, తనని కాపాడమని ముక్కోటి దేవతలకు మనసులో దండం పెట్టుకుంది.

"అమ్మగారూ, ఇల్లొచ్చింది దిగండి" అన్న రిక్షావాడి గొంతు విని మెల్లగా కళ్ళు విప్పింది. ఎదురుగా ఇంటి అరుగు మీద కూర్చుని విశాల కోసం ఎదురుచూస్తున్న ప్రదీప్ కనిపించాడు.

రిక్షాదిగి వణికే చేతుల్తో, హాండ్ బ్యాగ్ లోంచి ఐదు రూపాయల నోటు తీసి రిక్షావాడి చేతిలో పెట్టి, వాడు చిల్లరిస్తు న్నా తీసుకోకుండా ఇంట్లోకి పరిగెట్టింది విశాల.

భార్య ఆందోళనగా వుండటం గమనించిన ప్రదీప్ ఇంట్లోకెళ్ళి, ఆయాసపడుతూ వాలు కుర్చీలో కూర్చుని చీర చెంగుతో చెమటలు తుడుచుకుంటున్న విశాలని చూసి ఆశ్చర్యపోయాడు.

"ఏమైంది విశాలా? ఎందుకలా వున్నావు?" ఆమె దగ్గరి కొస్తూ అనునయంగా అడిగాడు.

మార్కెట్ వద్ద రిక్షా ఎక్కింది మొదలు, ఇంటి దగ్గర దిగే వరకు తననుభవించిన మానసిక క్షోభ అంతా భర్తకు చెప్పింది.

"పిచ్చి విశాలా! ఎంతో ధైర్యంగా వుండే నువ్వేనా ఇలా భయపడుతున్నది, నువ్వింత పిరికి దాని వనుకోలేదు. సర్లే, ఇహనుంచి ఆఫీసు నుండి వస్తూ కూరలు పట్టుకొస్తానులే, కాసేపు పడుకో మనసు కాస్త కుదుట పడుతుంది." అని ఆమె పడుకున్నాక, లైటార్పి తనూ పడుకున్నాడు ప్రదీప్.

* * * * *

అర్ధరాత్రి తలుపు కొడుతున్న చప్పుడవడంతో దిగ్గున లేచి, మంచం మీద నుంచి దిగి, లైటేసి గడియారం వంక చూసింది. రెండు గంటలు చూపిస్తోంది.

ఇంత అర్ధరాత్రి వేళ ఎవరొచ్చారబ్బా?' అనుకుంటూ తలుపు కున్న కంతలోంచి బయటకు చూసింది. అంతే ఒక్క సారిగా గుండె ఆగినంత పనైంది.

తలుపుకి అవతల వైపున రిక్షావాడు నుంచుని వున్నాడు. 'తనెన్ని సార్లు వినలేదు, పగలు రిక్షాతొక్కే కొంత మంది మంచి ఇళ్ళు ఎంచుకొని రాత్రి దొంగతనాని కొస్తారని, ఇప్పుడు తనేం చెయ్యాలి?''

ప్రదీప్‌ని లేపి విషయం చెప్పి, కర్తవ్యం ఆలోచించాలనుకున్న విశాలకి రిక్షావాడి మాటలు వినిపించాయి.

"నేనమ్మా రిచ్చావాడ్ని, ఇంటికాడ రిచ్చా తుడుత్తంటే సీటు మీద బంగారు గొలుసొకటి కానొచ్చిందమ్మా, పొద్దుటి నుండి పొద్దుగుంకేదాకా నా రిచ్చా ఎక్కిన ఆడోరు మీరేనమ్మా అంచేత గొలుసు మీ ఇంటికి పట్టుకొచ్చినాను. రేపొద్దుటే ఇద్దామనుకున్నాను. కానీ, ఎదవ మనసు ఎప్పుడెట్టా మారుద్దో అని ఇప్పుడే పట్టుకొచ్చేసినాను. తొరగా తలుపు తీసి గొలుసు తీసుకొండమ్మగారూ"

వాడి, మాటలు విన్న విశాల మెడ తడుముకుంది. ఆమె గుండె ఝల్లు మంది. రెండు నెలల క్రితం భర్త చేయించిచ్చిన గొలుసు మెడలో లేదు.

వెంటనే తలుపు తీసింది, గొలుసు ఆమె చేతిలో పెట్టి వెళ్ళి పోతున్న రిక్షా వాడ్ని చూస్తుంటే ఆమె కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

చదువుకున్న తన సంస్కారం ముందు అక్షర జ్ఞానం లేని రిక్షావాడి సంస్కారం ఎంతో వున్నతంగా కనిపించింది విశాలకి.

భుజంపై చేయి పడడంతో ఉలిక్కి పడి పక్కకి చూసిన విశాలకి ప్రదీప్ కనిపించాడు, తన ప్రవర్తనకు సిగ్గుతో కుంచించుకు పోతూ ప్రదీప్ గుండెలపై వాలి పోయి పోయి మౌనంగా రోదించసాగింది.

ఆమెను అనునయిస్తున్నట్టుగా, ఆమె తల నిమురు తుండి పోయాడు ప్రదీప్.